క్లుప్తంగా

సమ్మర్ క్లాసులు నిర్వహిస్తే చర్యలు

ఎంఈఓ శ్రీధర్

కమలాపూర్ : విద్యా శాఖ ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని, ఒకవేళ నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ కె.శ్రీధర్ హెచ్చరించారు. మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ ప్రకటన జారీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించాలని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పద్మశాలి సంఘం శాశ్వత సభ్యత్వ నమోదు



శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో కార్మికులకు అఖిల భారత పద్మశాలి సంఘం శాయంపేట గ్రామ ఉపాధ్యక్షుడు తుమ్మ ప్రభాకర్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం శాశ్వత సభత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పద్మశాలీలందరూ సంఘం బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, చేనేత సహకార సంఘం డైరెక్టర్ లక్ష్మీనారాయణ, గోపి పాల్గొన్నారు.

ఘనంగా నృసింహస్వామి జయంతి


దామెర : నృసింహస్వామి జయంతిని పురస్కరించుని మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం 11 గంటలకు శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 4 గంటలకు విశ్వక్సేన పూజ, పున్యాహవాచనం, అంకురార్పణ, సుదర్శన శిఖర కలశ గ్రామ శోభయాత్ర నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాసచార్యులు వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శ



పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అధ్యక్షుడు మోరె రాజేందర్ తండ్రి మోరె సారయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి జయ్‌పాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, నాయకులు నక్క చిరంజీవి, మేడిపల్లి శోభన్‌బాబు, పంచగిరి శ్రీను పాల్గొన్నారు.

విషగుళికలు మింగి వ్యక్తి ఆత్మహత్య



వేలేరు : విషగుళికలు మింగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన గుజ్జుల సంపత్‌రెడ్డి (34) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడు. అతడి ఆర్థిక పరిస్థితులు బాగాలేక కొన్ని అప్పులు చేశాడు. అయితే గత కొంత కాలంగా చేసిన అప్పులు తీర్చలేక మానసికంగా బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతడు మరిన్ని అప్పులు చేసి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం విషగులికలు మింగగా గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సంపత్‌రెడ్డి మృతిచెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

భద్రకాళి దేవాలయంలో హోమం

హన్మకొండ కల్చరల్ : ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తవ్వాలని భారత సైన్యం, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం శ్రీ భద్రకాళి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, చండీహోమం నిర్వహించారు. ఈఓ శేషభారతి, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ 'ఉపాధి' పనులు

- అందుబాటులో లేని మెడికల్ కిట్‌లు
- పనిప్రదేశంలో కనిపించని టెంట్లు, తాగునీరు
- ఇబ్బంది పడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు



లోక్యాతండాలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

వేలేరు : గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వేసవి కావడంతో ఎండలు దంచికొడుతున్నాయి. మండంలోని కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసే చోట సేద తీరేందుకు నీడ, తాగడానికి నీరు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పని ప్రదేశంలో సౌకర్యాలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అవి ఎక్కడ కనిపించడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అదే విధంగా పనిచేసే క్రమంలో కూలీలకు ఏమైన గాయాలైతే ప్రథమ చికిత్స అందిచేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా అందుబాటులో ఉంచకపోవడంతో కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూలీలు చేసిన పనులకు సకాలంలో డబ్బులు రాక అవస్థలు పడుతున్నారు. కొలతల ప్రకారం పనులు చేయకపోతే కూలీ గిట్టుబాటు కావడం లేదని కూలీలు వాపోతున్నారు.

14 గ్రామాలకు 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేలేరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని కొత్త గ్రామాలను కూడా ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ మేట్‌తో కలిసి పనులు చేయిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు పని కల్పించడంతో పాటు, పనుల ఫొటోలు తీయడం, జాబ్ కార్డులు మంజూరు చేయడం, కూలీలకు వసతులు కల్పించడం లాంటి పనులు చేయాల్సి ఉంటుంది. గతంలో ఉపాధి హామీ కూలీలకు తాగునీటికి రూ.5, గడ్డపారకు రూ.10, తట్టకు రూ.13, నడిచే దూరానికి కూడా కొంత డబ్బులు చెల్లించేవారు. కానీ కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఈ సౌకర్యాన్ని నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ఉపాధి హామీ కూలీలను పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

మండలంలో జాబ్ కార్డుల వివరాలు..

- మొత్తం జాబ్ కార్డులు 4,874
- మొత్తం కూలీలు 9,496
- యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులు 3,311

సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి హామీ పని చేసే చోట అధికారులు సౌకార్యాలు కల్పించడం లేదు. పని వద్ద తాగ దానికి నీరు లేకపోవడంతో ఇంటి వద్ద నుంచే తెచ్చుకుంటున్నాం. పని చేస్తున్నప్పుడు ఎమైనా గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు మెడికల్ కిట్లు అందుబాటులో లేవు. అధికారులు ఇప్పటికైనా పని జరుగుతున్న ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి. ఎండదెబ్బ తగలకుండా చర్యలు చేపట్టాలి.

- మురావత్ భిక్షపతి, లోక్యాతండ

వీర జవాన్లకు ఘన నివాళి

- వేయిస్తంభాల ఆలయం నుంచి కాగడాల ర్యాలీ



అమర జవాన్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా /హన్మకొండ: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన తెలుగుతేజం మురళీనాయక్, మరెందరో జవాన్ల వీరోచిత పటిమను స్మరిస్తూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వేయిస్తంభాల గుడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన భారీ ర్యాలీ నిర్వహించారు. ఒక చేతిలో కాగడా, మరో చేతిలో జాతీయ జెండాలతో యువకులు వందేమాతరం, భారత్‌మాతాకీ జై, జై జవాన్, జై కిసాన్, మురళీనాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాకేశ్‌రెడ్డి భారత సైన్యానికి రూ.25 వేల చెక్కును అందజేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ వంద శాతం విజయవంతమైందని రాకేశ్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న రిటైర్డ్ సోల్జర్ ప్రభాకర్, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఇండస్ ఫౌండేషన్ పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న ఈఓ, సిబ్బంది

హన్మకొండ కల్చరల్ : ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తవ్వాలని భారత సైన్యం, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం శ్రీ భద్రకాళి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, చండీహోమం నిర్వహించారు. ఈఓ శేషభారతి ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, అర్చకులు నాగరాజుశర్మ, ప్రదీప్ శర్మ సురేష్ శర్మ, అరవిందశర్మ, పర్యవేక్షకులు విజయ్‌కుమార్, హరినాథ్, అశోక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఘనంగా విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ధర్మసాగర్: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక వర్గానికి చెందిన వాడు కాదని, అందరి వాడని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని కేశవనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన భారతదేశం నేటికీ ఐక్యంగా ఉందంటే దానికి కారణం బీఆర్ అంబేడ్కరేనని వివరించారు. కేశవనగర్ చిన్న గ్రామం అయినా.. రాజకీయంగా తనకు అండగా నిలబడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే గ్రామానికి రోడ్డు వచ్చిందని, ఇళ్లు వచ్చాయన్నారు. మళ్లీ ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యంలోనే ఇళ్లు వచ్చాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూం అని ఉదరగొట్టి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. త్వరలో పెద్దపెండ్యాల నుంచి కేశవనగర్ వరకు బీటీ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రేవంత్ సర్కారు లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- 447 మందికి సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మండలాలకు చెందిన 447 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి రూ.1.56 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. ప్రతిఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

- సీఐ సుధాకర్

కాజీపేట : వేసవి సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి కోరారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. సెలవుల నేపథ్యంలో ఇప్పటికే పీఎస్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేశామని తెలిపారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కాలనీవాసులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఊర్లెళ్లే ముందు నమ్మకంగా ఉంటే ఇరుగుపొరుగు లేదంటే బంధువులకు సమాచారం ఇవ్వాలన్నారు. త్వరగా ప్రయాణం ముగించుకు రావాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 12న(సోమవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాపువాడ, అలంకార్, కాకతీయ కాలనీ, గుండ, విజయ డెయిరీ, ఉజిలీస్, గడీ మజీద్, జామా మజీద్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

మక్కా యాత్రికులకు సన్మానం

ఖిలా వరంగల్ : వరంగల్ శంభునిపేటలో తాజ్ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల డిప్యూటీ కలెక్టర్ ర్యాంక్ సాధించిన విలాయత్, కానిస్టేబుళ్లు, మక్కా యాత్రికులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంఘం అధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్ హాజరై వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, అజ్మీర్, జలీల్, తయ్యూబ్, ఇస్మాయిల్, మన్నాన్, ఖదీర్, యాకూబ్ పాల్గొన్నారు

సమష్టి కృషితోనే కాలనీ అభివృద్ధి సాధ్యం

వరంగల్ : కాలనీ సభ్యులంతా సమష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని మధురానగర్ కాలనీ పరపతి సంఘం నూతన అధ్యక్షుడు అలువాల సదాశివుడు అన్నారు. ఆదివారం 14వ డివిజన్‌లోని మధురానగర్ కాలనీ పరపతి సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నివేదికను ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, ఆదాయ, వ్యయాలను కోశాధికారి కుమారస్వామిలు సభ్యులకు వివరించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అలవాల సదాశివుడు, ఉపాధ్యక్షుడిగా షేక్ ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు ఎల్లయ్య, కోశాధికారిగా పుచ్చ కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడిగా బొడిగె సుదర్శన్, సమన్వయకర్తగా చిగురుమామిడి రాజమౌళి, ముఖ్య సలహాదారులుగా గుండా రవీందర్, కదం రాములు, బిల్లకంటి రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ఆడెపు శ్రీనివాస్, బోడ జవహర్ లాల్, వేల్పూరి ఈశ్వరరావు, పాక కృష్ణ, ఆకారపు రవి, చిలగాని రమేష్, దాసరి రాజు, కంచు శ్రీనివాస్, సంస్కృత, యూత్ కార్యదర్శిగా బట్టు సుమంత్, మహిళా విభాగం సమన్వయ కర్తగా బందారి సునీతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన-ఆత్మజ్ఞాన శిక్షణ ప్రారంభం

మడికొండ : కాజీపేట మండలం మడికొండలోని వాసవి కమ్యూనిటీ హాల్‌లో ఉచిత ధ్యాన-ఆత్మజ్ఞాన శిక్షణను ఆదివారం మడికొండ వాసవి సమితి అధ్యక్షుడు దొంతుల సమ్మయ్య ప్రారంభించారు. సుభాష్ పత్రీజీ దివ్య ఆశీస్సులతో 15 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. ధ్యానంతో ఏకాగ్రత ఏర్పడుతోందని, మనసు అదుపులో ఉంటుందని అన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సమ్మయ్య కోరారు. రామ్మూర్తి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

కాజీపేట : కాజీపేట పట్టణం బాపూజీనగర్ కాలనీలోని మురుగు కాల్వల్లో పూడికతీత పనులను పారిశుద్ధ్య సిబ్బంది కొనసాగిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో 25 మంది సిబ్బంది సైడ్ కాల్వల్లో పూడిక తీత పనులను చేపట్టారు. వర్షకాలం ఆరంభంలోగా కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలనే లక్ష్యంతో పనులను వేగవంతం చేశారు.

మంటల్లో మొక్కలు..



దామెర : హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది కాపాడి పెంచిపోషిస్తే దురదృష్టవశాత్తు అవి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన దామెర మండల కేంద్రం పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని ప్రతిమ క్యాన్సర్ ఆస్పత్రి నుంచి దామెరకు వెళ్లేదారిలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా విరివిగా హరిహారం మొక్కలను నాటారు. అనంతరం అధికారుల పర్యవేక్షణలో గ్రామపంచాయతీ సిబ్బంది చొరవతీసుకుని వాటిని సంరక్షించారు. దీంతో ఇప్పుడిప్పుడే రహదారికి ఇరువైపులా పచ్చదనం పెరుగుతుందని ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాని కొంత మంది రైతులు వారి పంట వ్యర్థాలను కాల్చేక్రమంలో పదుల సంఖ్యలో చెట్లు కాలి బూడిదయ్యాయి. లక్షల రూపాయలు వెచ్చించి పెంచుతున్న చెట్లు, మొక్కలు కాలిపోవడంపై అటుగా వెళుతున్న వాహనదారులు, వనప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు పునరావృతం కా కుండా చర్యలు తీసుకోవాని డిమాండ్ చేసున్నా రు.

వైభవంగా మత్స్యగిరి స్వామి కల్యాణం



శాయంపేట : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఆత్మకూరు : కల్యాణం జరిపిస్తున్న పండితులు

శాయంపేట : మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ మత్స్యగిరి స్వామి, శ్రీదేవి-భూదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి దంపతులు తమ ఇంటి వద్ద నుంచి స్వామి వారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను మంగళ వాయిద్యాల నడుమ తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. వేదమంత్రోచ్ఛరణ నడుమ ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, యాగ్నికులు వీరవెల్లి వేణుగోపాలచార్యులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. గట్ల జయపాల్‌రెడ్డి-సరోజన దంపతులు కల్యాణ దాతగా వ్యవహరించారు. అనంతరం ఆలయ చైర్మన్ సామల భిక్షపతి-రాజమణి దంపతులు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, జిన్నా కృపాకర్‌రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, మనీశ్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్వరరావు, చిందం రవి, బాసాని మార్కండేయ, వినుకొండ శంకరాచారి, వనం దేవరాజు, మార్త సుమన్, దిండిగాల వంశీ, బాసాని బాలకృష్ణ, గిద్దమారి సురేశ్, డి.సుమన్, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం హోమం, చక్రస్నానం, నాగవల్లి కార్యక్రమాలు అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి అధ్వర్యంలో వైద పండితులు వేద మంత్రోచ్చరణల నడుమ జరిగాయి. శనివారం అర్ధరాత్రి వరకు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. సోమవారం జాతర ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి కోరారు.

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి నారసింహ క్షేత్రంలో నృసింహ జయంతి వేడుకలను యాజ్ఞికులు రాఘవాచార్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయంలో నిత్యపూజల అనంతరం నాల్గో రోజు నిత్యహవనం, పూర్ణాహుతి జరిపించారు. అనంతరం పంచామృతాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకం జరిపించి, ఆరగింపు చేసి, భక్తులతో తనియ చదివించి, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులు లక్ష్మీనృసింహస్వామి, సీతారామచంద్ర స్వామి, గోధాకృష్ణ స్వామి, పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర మూర్తులకు ఒకే వేదికపై తిరుకల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. సునీత-శ్రీనివాస్, వైష్ణవి-శశాంక్ దంపతులు కల్యాణానికి హాజరైన సుమారు 1,500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు జయకృష్ణ ఆచార్యులు, రామాచార్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా ఉత్సహంగా, ఉల్లాసంగా గడిపారు. విద్యా బోధన చేసిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఆయా రంగాల్లో, ఉన్నత స్థానాల్లో స్థిరపడిన విద్యార్థులను చూసి గురువులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఒకే దక్కర కూర్చుని కష్టసుఖాలను పాల్పంచుకున్నారు. కొంతసేపు ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, ప్రకాశ్, ఉమామహేశ్వర్, గోపాల్‌రెడ్డి, కాశిరెడ్డి ఆదిరెడ్డి, శ్రీలత, హరిప్రియ, రవీందర్, హిమసాగర్, శ్రీధర్, అనిత, సూజాత, రాజేశ్, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



రేణుకా ఎల్లమ్మ విగ్రహానికి హారతి ఇస్తున్న అర్చకులు

ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలో ఆదివారం శ్రీరేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మొదటి రోజు గ్రామ పర్యటన, జలాధివాసం, యాగశాల ప్రవేశం పూజలు నిర్వహించారు. శనివారం సామూహిక హోమాలు, యాగశాల క్రమాలు, కుంకుమ అర్చనలు జరిగాయి. 11న యంత్ర ప్రతిష్ఠాపన, పూజాదికాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం అన్నప్రసాద వితరణ జరిగింది. 12న ఎల్లమ్మ పౌర్ణమి సందర్భంగా పట్నాలు, భోనాలు నిర్వహించనున్నారు, 13న అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు శ్రీపతి రవీందర్‌గౌడ్, సభ్యులు భాస్కర్, సంపత్, మొగిళి, భిక్షపతి, తిరుపతి, రవి పాల్గొన్నారు.